# అదృష్టం వరించింది

గుమ్మళ్ళ ప్రసాదరావు

**"కొంత మందిని అదృష్టం వరిస్తుంది."**

**"భగవాన్లూ! ఏమిటో ఆశ్చర్యంగా మాట్లాడుతున్నావు! 'ఇటు గుమస్తాలు సరిగా పని చేయరు, అటు ఆఫీసర్లు ఈ పని కాలేదు, ఆ పని కాలేదు అని వేధించుకు తింటున్నారు. పని ఎక్కువై తీరిక లేకుండా పోయింది' అనే నీవు అంటున్న దేమిటి? నీ జాతకం మారిందా?"**

భగవాన్లు రెండు కప్పులు టీకి ఆర్డ రిచ్చాడు.

"ముప్పై రెండేళ్ల సర్వీసులో ఏనాడూ ఏ ట్రెయినింగ్‌కూ వెళ్లే అవకాశం లేకపోయింది. పదవీ విరమణకు ఇంకా మూడేళ్లు సిండా లేవు. నన్ను ఈ మధ్య అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల ట్రెయినింగుకని హైదరాబాదు పంపించారు. ప్రభుత్వాని కేమైనా మతి ఉందా రిటైరు కాబోతున్న నాకు ఈ ట్రెయినింగు ఎందుకు? నాకు బదులు బాగా సర్వీసున్న మరొక ఆఫీసర్ని పంపిస్తే ఇంకా లాభం ఉండేదిగా? అయితే నేం ఈ రకంగా హైదరాబాదు వెళ్లే అవకాశం దొరికినందుకు సంతోషించా ననుకో!"

సర్వ రిచ్చిన టీ త్రాగుతూ - "ఏ మాట కామాట చెప్పుకోవాలి. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎంత క్రమశిక్షణ ఉండేది. ఈ రోజుల్లో ఎవ రెప్పుడు ఆఫీసుకి వస్తారో, ఎందుకు వస్తారో అర్థం కాదు. రోజులు మారాయి. ఎవరిని సమాధానం అడిగినా ఎదురు తిరుగుతారు. పోనీ పెద్దాఫీసర్లకు ఫిర్యాదు చేస్తే వాళ్ల కది చిన్న విషయంగా తోస్తుంది. తప్పు చేసిన వారిని మందలించరు సరికదా మననే అంటారు - 'నీ కింద స్టాఫ్ మీద నీ కెలాంటి నియంత్రణా లేదంటూ', వారి చనువు తీసుకునేగా కింద వాళ్లు మరింత బరితెగించుకుపోయేది.

"ఆఫీసు మేనేజ్‌మెంటూ - క్రమశిక్షణా ఈ రెండూ ఆ శిక్షణ ముఖ్య విషయాలు. దానివల్ల నా సమస్య కొక పరిష్కారం దొరుకుతుందని సంతోషించాను."

"నీ హుషారు చూస్తూ ఉంటే చాలా కొత్త విషయాలు తెలుసుకొని వచ్చినట్లుందే!"

"అవధాన్లూ! వెళ్తున్నది దూర ప్రాంతం. తెలుగు వాడినైనా ఈ మధ్యప్రదేశ్‌లో పని చేస్తున్నానా? హైదరాబాదులో కొంత హుందాగా ఉండాలని అనుకోవడం తప్పంటావా? నాలుగు జతల మంచి బట్టలు, మంచి దుప్పట్లూ, బెడ్డింగూ, దోమతెర ఇత్యాదులు తీసుకొని బయలుదేరాను. నాలా అనేక రాష్ట్రాల నుంచి ఎందరో అధికారు లా ట్రెయినింగుకి వస్తున్నారు. 'ఫలానా నాడు సరిగ్గా తొమ్మిదిన్నర గంటలకు ఫలానా ఆఫీసరుగారికి జాయినింగు రిపోర్టు ఇవ్వాలి. లేటుగా వచ్చిన వారు ట్రెయినింగ్‌లో అనుమతించబడరు' అని వాళ్లు ముందుగా తెలియజేశారు. ఈ రైళ్ల రాకపోకలని నమ్మలేంగా? అందుకని ఒక రోజు ముందే చేరి స్టేషనుకి దగ్గరలో ఒక లాడ్జీలో దిగి ఆ రాత్రి గడిపేను. మర్నాడుదయాన్నే ఆటోలో ఆ ఆఫీసుకి వెళ్లాను."

"ఆగిపోయావేం! చెప్పు!"

"ఒక అధునాతనమైన కాలనీలో ఒక దివ్యభవనం ముందు ఆటో ఆగింది. అబ్బా! ఏమని చెప్పను - ఆ భవనం ఇంద్రభవనాన్ని తలదన్నే లాగుంది. అవధానీ! అయితే నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. అప్పుడు తొమ్మిదింపావు కావస్తున్నది. కాని ఇనుపగేటులు తెరచి లేవు. బహుశా నేను సరియైన జాగాకి రాలేదేమోనని అనుకున్నాను. అయితే 'సెంట్రల్ అకాడమీ' అన్న బోర్డు ఉంది. నేను పది గంటల వరకు ఒంటరిగా అక్కడే నిలబడి ఉండిపోయాను. ఏమని అడగవేం?"

"అది నీవు చెప్తావుగా? అది ప్రభుత్వపు ఆఫీసాయె. మనది భారతీయ కాలమాన మాయె. బహుశా వాచ్‌మన్ తాళం బిగించి మసాలా దోశ తినడానికి పోయి ఉంటాడు" అన్నాడు అవధాని.

"పది దాటిన తరువాత వాచ్‌మన్, వాడి వెనుక ఇద్దరు స్వీపర్లూ వచ్చారు."

"కొంపతీసి వాళ్ల వెంటే నీవూ జొరపడ్డావా?"

"తొమ్మిదిన్నరకల్లా మేం రిపోర్టు చేయాలే! అక్కడ ఓ పిట్ట లేదు. నేను నా సామానులతో లోనికి వెళ్లాను. 'చూడండీ! ఆఫీ సింకా తెరవలేదు. మీరు ఓ గంట ఆగి రండి. అదిగో ఆ సందు తిరుగుతే ఓ కాఫీ దుకాణం ఉంది' అంటూ స్వీపరు నన్ను తగిలేశాడు. నేను చెప్పేది వాడు వినిపించుకోలేదంటే నమ్ము."

"నమ్ముతాను. భగవాన్లూ! కొంతమందిని అదృష్టం వరిస్తుంది అన్నావు. నిన్నా అదృష్టం ఎలా వరించిందో చెప్పడాని కింత ఉపోద్ఘాతం' అవసరమా? హైదరాబాదు లోనైతేనేం? మన భోపాలు లోనైతేనేం? కేంద్ర ప్రభుత్వపు ఆఫీ సైతేనేం? రాష్ట్ర ప్రభుత్వపు ఆఫీ సైతేనేం పదకొండు గంటలకు ముం దెవరూ రారు, పనులు చెయ్యరు. నువ్వు దూరపు కొండలు నును పనుకున్నావు."

"నిజమే సుమీ! సగం మంది ఆ రోజు రానేలేదు. తీరిగ్గా మర్నాడు వచ్చారు. అయినా వాళ్లను తరిమేయలేదు. అవధాన్లూ! మరో మాట చెప్పనా?"

"చెప్పడానికేగా పిలిచావు. టిఫినూ, టీలూ ఇప్పించావు. ఊ! కానీ!"

"మా కని నిర్దేశించిన హాస్టలు ఓ ఫైవ్ స్టార్ హొటల్లా వెలిగిపోతున్న దనుకో. అప్పుడు నా కర్థమైంది - నేను ఎరగక ఇన్ని సంబారాలు తెచ్చుకున్నానే అని."

"బాగుంది! అది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రం. మన దేశం నాలుగు చెరగుల నుండే కాదు, దేశ విదేశాల నుంచి ఉద్యోగస్తు లొస్తారు. పట్టెమంచాలు, డన్‌లప్ పరుపులూ, దోమతెరలు ఇలాంటి అన్ని హంగులూ ఉంటాయి. అతిథి అభ్యాగతులను సత్కరించడం మన పురాతన ఆచారం. నువ్వే ఒక పల్లెటూరి బైతులా వెళ్లావు. ఈ సంగతులకేం? ట్రెయినింగు ఎలా ఉంది? కొత్త విషయాలు తెలిశాయా?"

"అయ్యో! నన్ను పంపింది అందుకేగా? తెలుసుకోవడం నా విధ్యుక్తధర్మం కదా?"

"భగవాన్లూ! బాగానే ఉంది. ఈ మధ్యనే లాల్‌బహదూర్ స్టేడియంలో దక్షిణ జట్టుకి, ఉత్తర జట్టుకి మధ్య రంజీట్రోఫీ మేచ్ జరిగింది. పోనీ అది చూశావా?"

"అవధానీ! నే నో పెద్ద పొరపాటు చేశాను. ఉదయం, మధ్యాహ్నం క్లాసులు ఉండేవి. అన్ని పిరియడ్లూ విధిగా హాజరు కావా లన్నారు. నా బొంద మరి ఆ మేచ్‌కి ఎలా వెళ్లను? క్రమశిక్షణ, శిక్షణకు వచ్చిన నేనే క్రమశిక్షణ పాటించకపోతే నామీద తగిన చర్య తీసుకోరా? నేను ఊరికనే భయపడ్డానని ఆ తరువాత గ్రహించాను. చేతులు కాలిపోయిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు.

"ఆ రెండు రోజులూ అసలు క్లాసులు జరగనే లేదు. మా ముప్పై మందిలో ముచ్చటగా ముగ్గురమే క్లాసులకు వెళ్లే వాళ్లం. చిత్ర మేమిటంటే ఆ క్లాసులు తీసుకోవలసిన మహానుభావులూ రాలేదు. ఒకరికి తలనొప్పి వచ్చిందట, వేరొక బంధు వెవరో బాల్చి తన్నేశాడట. అదంతా ఉత్తదే. వాళ్లూ మేచ్ చూడడాని కని దొంగసాకులతో సెలవు తీసుకున్నారు."

"భగవాన్లూ! ట్రెయినింగ్ అదే సమయంలో ఎందుకు పెట్టారు? మన బోటివారు ప్రభుత్వపు ఖర్చులతో విశేష ఆటల పోటీలు చూడా లనేగా?"

"అదే నిజం లాగుంది. క్రమశిక్షణ గురించి నేను తెలుసుకున్న దానితో నా కనువిప్పు కలిగిందనుకో! 'మీ రందరూ బాగా అనుభవం ఉన్న అధికారులు. మీ అనుభవాలు చెప్పండి' అన్నా రో లెక్చరరుగారు. అత నెవరో కాదు. ఆ కార్యాలయానికి హెడ్డు. కొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. 'ప్రభుత్వ ఆఫీసులు సరిగా పని చేయాలంటే క్రమశిక్షణ ముఖ్యం. క్రమశిక్షణను పాటించని వారిని దండించాలి.

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. అసలు ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరగకపోవడానికి కారణం ప్రభుత్వ సిబ్బంది విచ్చలవిడితనం. సమయానికి రారు. గంటో రెండు గంటల ముందో వెళ్లిపోతారు. ఆ ఉన్న సమయంలోనైనా పనులు చేస్తారా? కొంతసేపు కేంటీనులో, కొంతసేపు టెలిఫోనులో మిత్రులతో సంభాషణ. పని పేరుకుపోతే ఓవర్ టైము కోరతారు. ఇలాంటి వాటిని మనం సమర్థించకూడదు' అంటూ అతను అనర్గళంగా ఉపన్యసించాడు."

"ఇవి మనకు తెలియనివా? నివారణోపాయాలు చెప్పారా?"

"అదే చెప్తున్నా! 'క్రమశిక్షణ పాటించని వారిమీద త్వరితంగా చర్య తీసుకోవాలి. ఒక ఆఫీసులో ఒకరిని దండిస్తే తతిమ్మా వాళ్లు జాగ్రత్త పడతారు."

"భగవాన్లూ! నిజమే సుమీ! మన అధికారి ఏడాది కోమారు సరిగ్గా పదిన్నరకు హాజరీ రిజిస్టర్లు చెక్ చేసి ఆలస్యంగా వచ్చిన వాళ్లను తిడితే ఓ వారం రోజులు అందరూ వేళకు వస్తూంటారుగా?"

"నిజమే అవధానీ! ఆ తరువాత షరా మామూలే. అయితే నా కో అనుమానం వచ్చింది. 'ఆఫీసు సమయంలో గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటారు కొందరు. ఆడవాళ్లయితే స్వెట్టర్లు అల్లుకుంటారు. కొందరు చీటికీ మాటికీ కేంటీనుకి, పోస్టాఫీసుకి, లేదా మ రేదో స్వంత పనులమీదా ఉడాయిస్తారు. వారిని ఎలా దారిలోకి తేవడం? ఎలా దండించడం?' ఇదే ప్రశ్న వేశాను."

"మంచి ప్రశ్న వేశావు. వారి నెలా దారిలోనికి తేవాలో చెప్పి ఉండరు. పేరుకు మనం అధికారులమైనా మన అధికారాలు కుంచించుకుపోయాయి. కొందరు పె ద్దాఫీసర్లను కాకా పడతారు. కొందరికి రాజకీయ నాయకుల అండదండ లుంటాయి. కొందరు డబ్బుని మంచినీళ్లలా ఖర్చు పెట్టి అధికారుల మీద తమ బలం చూపిస్తారు. వీరిని ఎలా శిక్షించగలం? అయినా ఏదో చెప్పి ఉంటారే?"

"ఆ విషయమేగా నేను చెప్పా లనుకున్నది. 'ఇలాంటి' వారు సంఘ విరోధక శక్తులు. మన మీనాడు ఇంత దీన స్థితిలో ఉండడానికి మనమే కారణం. పని దొంగలను క్షమించరాదు. వారి వెనుక ఎన్నో అదృశ్య హస్తా లున్నాయని మనకు తెలుసు. తెలుసు కాబట్టి వారిని విడిచిపెడితే మన కార్యాలయాలు అధోగతి పాలు అవుతాయి. దాన్ని మన లాంటి సుశిక్షితులు చూస్తూ ఎలా ఉపేక్ష చేయగలరు? శాయశక్తులా మనం అలాంటి వారిని శిక్షించాలి. ఒకవేళ మన చర్యలను పూర్వాగ్రహంతో పై అధికారులు ఆమోదించకపోతే మనం పరిస్థితులతో రాజీ పడకూడదు. అవసరమైతే ఉద్యోగానికి రాజీనామా




ఇవ్వాలి' అన్నాడు."

"భగవాన్లూ! నీ తెలివి తెల్లారినట్లే ఉంది. అంతటి సాహసం ఎవరు చేయగలరు? చీమూ నెత్తురూ ఉన్న ఆఫీసరు ఆ పని చేయగల డనుకో. అలాంటి వారు నూటి కొకరైనా ఉంటారా? నీకేం నీ సర్వీసు నిండా మూడేళ్లు లేదు. ఉద్యోగం వదిలినా నీ కేమీ పెద్దగా నష్టం లేదు. అందుకే అత నన్నది చాలా బాగున్నట్లు తోచింది."

"అవధానీ! నన్ను చెప్పనిస్తావా? ఆ క్షణంలో నే నలాగే అనుకున్నాను. ఈ పని దొంగల చేత పని చేయించలేక అటు ఆఫీసర్లతో మాటలు పడుతూ ఎందుకు పని చేయాలి? కారణాలను పేర్కొంటూ రాజీనామా చేస్తే కొంత పేరైనా ఉంటుంది. అయితే ఆ తరువాత మరో సంఘటన జరిగింది.

"మా శిక్షణ పూర్తి అయింది. ఆ రోజు అయిదు గంటల బండికి టిక్కెట్టు రిజర్వు చేయించుకున్నాను. రిలీవింగు లెటరు కావాలిగా? సుమారు రెండు గంటల ప్రాంతంలో ఆఫీసరుగారి గదికి వెళ్లాను. నా పేరూ, నే నొచ్చిన పని కాగితం మీద రాసి బయట కూర్చున్న బంట్రోతు కిచ్చి లోపలకు పంపేను.

"మీ రా గదిలో కూర్చోండి. అతను పిలిస్తే లోనికి వెళ్దురుగాని - అని నాతో అని ఆ బంట్రోతు బీడీ వెలిగించి కాలుస్తూ వెళ్లిపోయాడు. వాడు దూరంగా లాన్‌లో మాలీతో కాబోలు మాట్లాడుతున్నాడు. కొంతసేపటికి కాలింగ్ బెల్ మ్రోగింది. బైట ప్యూను ఉంటేగా? లోనుండి ఆఫీసరు ప్రతి పది నిముషాలకు కాలింగ్ బెల్ మ్రోగిస్తున్నాడు. మరి ఆ బంట్రోతు ఏ విషయాలు అక్కడ చర్చిస్తున్నాడో తను డ్యూటీలో ఉన్న విషయమే మరిచిపోయాడు. అలా కాలం గడిచిపోతున్నాది. చొరవ చేసి వెళ్దామంటే అతను క్రమశిక్షణ పాటించనందుకు ఉగ్రుడౌతా డేమోనని భయం. నే నొచ్చి రెండు గంటలు గడిచింది. చివరకు లాభం లేదనుకున్నాను. ఏమయితే అదే



అవుతుందని లోనికి వెళ్లాను. అతను తలెత్తి నన్ను చూడలేదు.

'రంగన్నా! ఎటు పోయావు? గంటకు పైగా అయింది నిన్ను పిలుస్తూ' అన్నాడు. బహుశా లోనికి వచ్చింది రంగన్నే అనుకున్నారు కాబోలు.

'సార్! నేను రంగన్నని కాను. శిక్షణ కని వచ్చిన భగవానుల్ని. నా రిలీవింగు లెటరు మీద తమరు సంతకం చేస్తే ఈ అయిదు గంటల బండికే వెళ్లాలి' అన్నాను.

'సంతకం ఎప్పుడో చేశాను. మిమ్మల్ని పంపమని చెప్పాలని రంగన్నను పిలుస్తూనే ఉన్నాను. వా డెక్కడ చచ్చాడో?'

'సార్! మీరు గంట మ్రోగించడం నేను వింటూనే ఉన్నాను. మీ రంగన్న ఆ లాన్‌లో ఎవరితోనో హస్కు కొడుతున్నాడు - తన కర్తవ్యాన్ని విస్మరించి. మీరు కఠిన చర్య తీసుకుంటారన్న భయమే లేనట్లుంది' అన్నాను.

'కఠిన చర్యా! వాడిని కన్నెత్తి చూడలేను. పన్నెత్తి తూలనాడలేను. మంత్రిగారి ఊరివాడు. మంత్రిగారి ఔట్‌హౌస్‌లో ఉంటున్నాడు.'

"అయితే నేం సార్! సక్రమంగా పని చేయనివారి మీద చర్య తీసుకునే అధికారం మీకు లేదా? మంత్రిగారి మనిషని మీ రెలా ఉపేక్ష చేస్తారు? మీరు మాకేం బోధపరిచారు? మీ ప్రసంగం న న్నెంతో ప్రభావితుడిని చేసింది. మీ అడుగుజాడల్లో నడిచి అవసరమైతే పదవికి రాజీనామా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. మీరే నాకు ఆదర్శం" అన్నాను.

అతను నన్ను కూర్చో మన్నాడు. "తొందరపడి అలాంటి నిర్ణయం తీసుకోకండి. అలా చేస్తే నష్టపోయేది మనమే. ఈ వ్యవస్థతో మనం రాజీ పడాలే గాని ఎదిరించి సాధించలేం. ఈ ఆఫీసులో ఇలాంటి రంగన్నలు ఎందరో ఉన్నారు. చూసీ చూడనట్లు నడచుకోవాలి. దానివలన మనకు కొన్ని లాభా లున్నాయి" అన్నారు.

"మరి ఆ రోజు అలా చెప్పారే?" అన్నాను.

"అది పాఠం. ఇది యథార్థం."

"అవధానీ! అదీ సంగతి. ఈ శిక్షణ వలన నేను చాలా గ్రహించేను. వెంకటేశ్వరరావు లేడూ? అతను బి.ఏ. పిల్లలకు పాఠాలు చెప్తాడు. వాడు మా అబ్బాయికి రోజూ పాఠాలు చెప్తున్నాడు - ఉచితంగా. అయితే ఆఫీసుకి కేవలం సంతకం చేయడానికి వస్తాడు. ఇక ప్యూను వెంకన్న మా ఇంటి పనులు చేసుకుపోతున్నాడు. వీ రిద్దరూ డ్యూటీకి రాకపోయినా ఆఫీసు నడుస్తూనే ఉంది" అన్నాడు భగవాన్లు. ★

వచ్చేవారం: మౌడుగ్నాసులు

